# కనువిప్పు

సాయంత్రం అయిదు గంటల నుంచీ ఏకధారగా వర్షం కురుస్తోంది.

ఆనందరావుకు ఏమీ తోచడం లేదు. డ్రాయరుమీద కాళ్లు పెట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు. ప్రక్కన టేబుల్ లైటు వెలుగుతోంది. కిటికీలోంచి చల్లగాలి విసరి కొడుతోంది. ఆ చలిని భరిస్తూ అలానే కూర్చున్నాడు. బీరువాలోంచి వులెన్ స్వెట్టరుతీసి తొడుక్కుందామనుకున్నాడు— కాని, కుర్చీలోంచి లేచి మూడు గజాలదూరంలో ఉన్న బీరువావరకూ నడిచి, స్వెట్టరు తొడుక్కోవాలిగా! కిటికీ తలుపులు బిగిస్తే-చలి తగ్గుతుం దనుకున్నాడు. కాని కిటికీ తలుపులు బిగించవద్దూ! ఎనిమిది గంటలకు భోజనంచేసి—అట్లా కుర్చీలో కూర్చున్నాడు. పది నిముషాల కొక సిగరెట్టు చొప్పున కాలుస్తూ, ఆలోచిస్తున్నాడు.

ఇంట్లో భార్య పద్మ లేదు. బంధువుల ఊరు శుభకార్యానికి వెళ్ళింది. ఆమె ఇంట్లో ఉంటే—యీ వానాకాలపు రాత్రి తనకు ఇంత వూపిరాడకుండా వుండేది కాదని ఆనందరావు ఎన్నోసార్లు అనుకున్నాడు. బయట జోరుగా వర్షం కురుస్తోంటే, ఎంత నరాలు కొంగర్లు పోయే చలి గాలి లోపలకు తోసుకువచ్చినా—ప్రక్కన కమ్మగా కబుర్లు చెబుతూ కిల కిల నవ్వించే భార్య, చదరంగం, పేక, క్యారమ్స్ మొదలైన ఆటల్లో పాల్గొని కాలాన్ని మరపించే భార్య, బాహువుల మధ్య విలాసంగా

యిమిడి పెదాల వొత్తిడితో, కౌగిలింతల బరువుతో, వెచ్చదనాన్ని కలిగించే భార్య,—వుంటే వాన కురిసే రాత్రులు ఎంత మధురంగా గడిచిపోతాయి! ఆనందరావు అట్లానే ఆలోచిస్తున్నాడు...

సినిమాకు వెళదామన్నా వీలును కలిగించకుండా కురుస్తోంది వాన. నిద్ర వొచ్చేవరకూ చదువుకుందామని సోమర్‌సెట్ మామ్ పుస్తకం తీశాడు. నిద్ర రాకపోగా, విసుగు జాస్తి కాసాగి, మనస్సు పరధ్యానంలో పడింది. హాఫ్ ఇయర్లీ ఎగ్జామినేషన్స్ తాలూకు బి. ఏ. వాళ్ళ పొయట్రీ పేపర్లు దిద్దకుండా అట్లానే షెల్ఫ్‌లో పెట్టివున్నాయి. వాటిని వాల్యూ చేద్దామనుకొని కట్టవిప్పాడు. ఒక పేపరు వాల్యూ చేశాడు. పదిహేడు మార్కులు వేశాడు. మనస్సు ఎక్కడనో వుంచి పేపర్లు దిద్దితే—రేపు కాలేజీ విద్యార్థులు తనమీదపడి ఏడుస్తారు. మళ్ళీ పేపర్లు కట్టకట్టి షెల్ఫ్‌లో యథాస్థానే అట్టే పెట్టాడు. అతనికి నిద్రవొచ్చే మార్గం దొరకలేదు. నిద్ర రాకుండా వుంటే—మతి భ్రమించేట్టు ఉంది. ఎట్లా?

పావుగంటసేపు గదిలో పచార్లు చేశాడు; కిటికీ తలుపులు మూశాడు; బీరువా తెరచి ఉలెన్ స్వెట్టరు ధరించాడు.—చలి తగ్గిందా? మనస్సులోని వెలితి సమకూడిందా? లేదు. పద్మను నిందించాడు. ఆమెను పిలిచిన బంధువుల్ని తిట్టుకున్నాడు.

రాజేశ్వరి ఏం చేస్తోందో?

రాజేశ్వరి పద్మ చెల్లెలు; అంటే ఆనందరావు మరదలు. కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమె బంధువుల ఇంటికి వెళ్ళలేదు. ఆమెకు కాలేజీ ఉంది. అదీగాక పద్మ ఆ పిల్లను, బావకు భోజన వసతులు సక్రమంగా చూడటానికి గాను ఇంట్లోనే ఉండమన్నది. రాజేశ్వరే ఉదయం కాఫీ, పన్నెండు గంటలకు భోజనమూ, మూడు గంటలకు మళ్ళీ కాఫీ ఫలహారమూ, రాత్రికి భోజనమూ-తయారుచేసి పెట్టింది. ఆ ఇంట్లో - ఆవానకాలపు చలి రాత్రి—ఉన్నదివాళ్లిద్దరే!

'రాజేశ్వరి ఏం చేస్తోందో?' అనుకున్నాడు మళ్ళీ ఆనందరావు.

బాత్ రూమ్‌లో స్నానం చేస్తోంటుందా? లేకపోతే టాయిలెట్ చేసుకుంటో వుంటుందా? వంటగదిలో భోజనం చేస్తూందేమో! ప్చ్...

గదిలో తలుపులు బిగించుకొని, చలికోర్వలేక క్లాసులో ఏ కుర్రవాడ్నో తలచుకొంటూ దిండును కౌవలించుకొని పడుకొని వుంటుందేమో? ఛీ... ఏం ఆలోచనలు! ఆ అమ్మాయి ఎట్లా వుంటే తనకేం? వంటగదిలోనే వుండి వుంటుంది. తను వెళ్ళి చక్కా-రావడం ఏమిటి? దేనికి?...నిజమే! తను వెళ్ళి చూడట మేమిటి? తనలో తనే నవ్వుకున్నాడు ఆనందరావు.

ఏం చూస్తే!

రాజేశ్వరి ఎంతో బావుంటుంది. అసలు ఆ పిల్లని తను పెళ్లాడి వుండవలసింది. పెళ్లికి ముందు ఆమెను చూసి వున్నట్లయితే తను అట్లానే చేసి వుండే వాడు. కాని పెళ్లి అయినాక కానీ తెలియ లేదు—తనకు అల్లాంటి తామర పువ్వులాంటి మరదలు పిల్ల ఉన్నదని. రాజేశ్వరి అందమంతా ఆ కళ్ళలోనే ఉంది. అంత నలుపూ, అంత నిర్మలత్వమూ, అంత ఆకర్షణా—తను ఏ స్త్రీ కళ్ళలోనూ చూసి వుండలేదు. ఆ కళ్ళే ఆమె రూపానికి ప్రాణం పోశాయి, స్త్రీ జన్మకు సార్థకతను చేకూర్చాయి. ఆమె శరీర నిర్మాణం మటుకు-ఎంత మనోహరంగా వుంటుంది! ఆ అవయవాల పొందికా, ఎత్తుకు తగినలావూ, లావుకు తగిన ఎత్తూ- —గులాబీరంగు మైసూరు క్రేప్ సిల్కు పరికిణీ ధరించి, అదే సిల్కు పట్టురంగు వోణీ-జార్జెట్ వాయల్ సిల్కు-పచ్చజాకెట్టు మీద ధరించి, రెండు జడల ఆగాధం మధ్య పువ్వులు విలాసంగా అమర్చి - హైహీల్సు టకటక లాడిస్తూ, కొండమీద నుంచి నీళ్లు జారి పడుతోన్నట్టు, నడుస్తోంటే ఆ సౌందర్యాన్ని ఎట్లా వర్ణించటం?

ఒకరోజు మధ్యాహ్నం భార్యకోసం రాజేశ్వరి గదిలోకి వెళ్లాడు తను. ఆగదిలో తన భార్యలేదు. బెడ్ మీద రాజేశ్వరి నిద్రపోతోంది. నిద్రలో ఆమె పైట తొలగింది. కిటికీలోంచి మల్లెపూల పందిరి మీదుగా వొచ్చే మధ్యాహ్నపు వేడిగాలికి ఆమె నుదురుమీద ముంగురులు అందంగా ఆడుకుంటున్నాయి. నిద్రమత్తులో అవ్యక్తంగా ఆమె పెదాల మీద దరహాసం నాట్యం చేస్తోంది. స్తంభించిపోయి రెండు నిమిషాల పాటు మంచం ప్రక్క నిలబడి రెప్ప వాల్చకుండా ఆమెవంక చూశాడు. ఆ రెండు నిముషాల్లో తన శరీరంలో హఠాత్తుగా ఎంత విద్యుచ్ఛక్తి ప్రవహించింది! మోహావేశంతో వొణికిపోయాడు. ఆమె ప్రక్కనే కూర్చుని,

ముందుకు వంగి, ఆమె పెదాల్ని తనివితీరా ముద్దు పెట్టుకోవాలనీ...ఆమె నడుం చుట్టూ చేయివేసి ఎంతో గాఢంగా దగ్గరకు లాక్కోవాలనీ... అనుకున్నాడు. కాని ఆ పని చేయడానికి ఎంత సాహసం కావాలి! ఏమీ చేయలేక మరో రెండు నిముషాలపాటు ఆమె సౌందర్యాన్ని లొట్టలు వేసు కుంటూ చూసి, నిలవ తొక్కుకొని ఎలాగో యివతల కొచ్చాడు. తను అటువంటి దృశ్యాన్ని జన్మలో చూస్తాడా? రాజేశ్వరే తన భార్యయి వుంటే...

రాజేశ్వరి గదిలోకి వొచ్చింది.

గులాబీ రంగు మైసూర్ క్రేప్ సిల్కు పరికిణీమీద, మబ్బురంగు అదే సిల్కు వోణీ ధరించింది. చిలకపచ్చపట్టు జాకెట్ వేసుకుంది. రెండు జడలమధ్య- మల్లె, చామంతి పువ్వులు తురిమింది. ముఖానికి పాండ్స్ స్నో, టాల్కం పౌడరూ పులిమింది. సహజ సౌందర్యానికి అవి తోడ్ప డగా—ఫిలిప్స్ లైటు కాంతిలో ఆమె మిరుమిట్లు గొలిపే 'కాంతి రేఖ'గా తయారైంది. ఆనందరావు స్తబ్ధుడై—ఆమె కేసి అట్లానే చూస్తూ వుండిపోయాడు. ఆ చూపులకు ఆ పిల్ల పులిని చూసిన లేడిపిల్లవలె బెదిరింది.

బయట జోరుగా వాన కురుస్తోంది. చల్లగాలి లోపలికి మహా ప్రవాహం మల్లే వొచ్చి పడుతోంది.

రాజేశ్వరి మంచినీళ్ళ మరచెంబూ, గ్లాసూ—బెడ్ ప్రక్క కిటి కీలో పెట్టేందుకు బెడ్ దగ్గరకు వెళ్ళింది.

ఆనందరావులో అగ్నిపర్వతం బ్రద్దలైంది.

కుర్చీలోంచి లేచాడు. గుండెల్లో దడ, కాళ్ళల్లో వొణుకు, ముఖంలో స్వేదం—దగ్గరకు నడిచి వెళ్లాడు.

బావ రాకనూ, ఆ రాకలోని తీరునూ, చూసి భయపడింది రాజేశ్వరి. చేతిలోని మరచెంబును క్రిందకు జార్చింది.

బయట జోరుగా వానా, లోపల జాస్తిగా చలీ, రాత్రీ, పడక గదీ, పందిరి మంచంపైని పట్టుపరుపూ, ఫిలిప్స్ లైటు కాంతీ, ఏకాం తమూ, గులాబీ పువ్వువంటి ఆడదీ,...అహా! ఏం అనుభవం!

ఆమెకు దగ్గరగా వెళ్ళాడు ఆనందరావు. అటు కిటికీ చువ్వలూ, ఇటు పందిరి మంచపు పట్టుపరుపూ-మధ్యలో ఇద్దరూ ఉన్నారు.

'రాజేశ్వరీ!'

ఒకచేత్తో ఆమె చెయ్యి పట్టుకొని, మరో చేత్తో ఆమె నడుం చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు. రాజేశ్వరి వొణికి పోతోంది. ఆనందరావు ఆవేశం కొద్దీ-ఆమెను మంచం మీద పట్టు పరుపుపై కూర్చో బెట్టాడు. ఆమె భుజాల చుట్టూ చేతులువేసి నవ్వుతూ ఆమె ముఖంమీదకు వాలాడు...ఆమె పెదాలు వొణుకుతున్నై. ఏదో మాట్లాడాలని, తనకు యీపని బొత్తిగా ఇష్టం లేదని, తను అట్లాంటి అవినీతికి పాల్పడలేననీ,--చెప్పాలని మనస్సులో ఎంత ఆవేశం వుంటేమాత్రం ఏం లాభం? మాటలు బయటికి రావద్దూ?

పెళ్ళికానిపిల్ల-వయస్సులో ఉన్నది. మగవాడి సౌఖ్యానికి, 'నీతి-అవినీతి' అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిన పురుషుని మోహానికి, బలి కాబోతోంది. మూగపోయిన ఆమె గుండెలోని బాధని విప్పి చెప్పే అవకాశం లేదా? అవినీతిని ద్వేషించే ఆమె హృదయ ఘోషను వినే అగత్యం లేదా? జన్మ కంతటికీ 'మచ్చ'గా నిలిచే ఆ అవినీతి కార్యా న్నుంచి ఆ కన్యను రక్షించే వాళ్ళు లేరా? ఆమె తాత్కాలిక మోహానికి గురై, అనిర్వచనీయమైన ఆనందానికి ఎరయి—లోకం తన జీవితాం తమూ 'పతిత'గానే పరిగణించ బడాలా? వేరేమార్గం లేదా? ఏ భగ వంతుడూ యీ పాపకార్యాన్నుంచి ఆమెను రక్షించలేడా? చదువూ, విజ్ఞానం, వివేకమూ, విచక్షణా అన్నీకలిగి, మెరుపులాంటి తాత్కాలిక మోహానికి లొంగి, పెళ్ళికాని ఓ పిల్లను తనకీ అనుభవాన్ని యిచ్చే వస్తు వుగా ఉపయోగించుకొని, ఆమె బ్రతుకుయొక్క భవిష్యత్తులోని అంధ కారానికి కారణ భూతుడయ్యే అతని దుర్మార్గాన్నీ, అవినీతినీ ఎవ్వరూ అరికట్ట లేరా?

ఆమె పెదాలమీదకు వాలాడు ఆనందరావు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి. ముఖంలో విషాదం నలుపైంది.

ఆనందరావు ఠక్కున ముఖం పైకి ఎత్తాడు. ఆమె కళ్ళ వెంట రాలిన నీళ్ళు చెంపలమీదుగా క్రిందికి జరజర జారినయ్. ఆ కన్నీటి చారలవెనుక దాగి ఉన్న విషాదం క్షణంలో అర్థమైంది ఆనందరావుకు.

అతనిలో మోహం గాలి తీసివేసిన బెలూన్ చందమైంది.

ముఖం కిటికీ ప్రక్కకు తిప్పుకున్నాడు. ముఖం ఎర్రనైంది. జుట్టు పీక్కున్నాడు. చేతులు నులుము కున్నాడు. మెడ సవరించు కున్నాడు.

బయట జోరుగా వర్షం కురుస్తోంది.

'రాజేశ్వరీ—!' మంచం ప్రక్కకు తిరిగాడు.

మంచం మీద రాజేశ్వరి లేదు.

రాజేశ్వరి భయంతో వొణికి పోయింది. ఎట్లాగో గదినుంచి బయట పడింది. ఏదో గొప్ప తప్పు చేసినట్టు గుండె విపరీతంగా కొట్టుకుంటోంది. నడిచే ఓపిక లేదు. అటూ ఇటూ తూలుతూ తన గదిలోకి వెళ్ళి మంచం మీద కూలబడింది, కన్నీటి ముద్దయి.

ఆ సంఘటన తలుచుకున్న కొద్దీ గుండె తరుక్కు పోతోంది.

బావ ఎంత సాహసం చేశాడు! తనని చూడగానే అకస్మాత్తుగా బావలో ఆ పాడు బుద్ధి పుట్టిందా? ఛీ...అసలు తను ఇంతగా ఎందుకు అలంకరించుకుంది? తనకి యీ రాత్రిపూట యీ మైసూర్ క్రేప్ సిల్కు పరికిణీ, వోణీ ఎందుకు? పట్టు జాకెట్టు ఎందుకు? మామూలు వాయిల్ దుస్తులు వేసుకుంటే పోదూ? ఇంట్లో బావ ఒక్కడే ఉన్నాడు గదా! అక్కయ్యకూడా లేదుకదా...తను ఇంత అందంగా తయారు కావడ మెందుకు? ఛీ.. తనకే బుద్ధిలేదు. తనను చూడగానే బావ మనసు చలించిందా? లేకపోతే అంతకుముందే బావకు తనమీద మోజు ఉందా? ఇట్లాంటి ఏకాంతమైన రాత్రికోసం వేచి ఉన్నాడా? బావ అంత అవినీతి పరుడా? అక్కయ్య ఉండగానే బావ మరో స్త్రీకోసం, మరో స్త్రీతోడి అనుభవం కోసం ప్రయత్నిస్తున్నాడా? ఏం సబబు? ఏం నీతి? ఏం న్యాయం! కట్టుకున్న భార్యకు ద్రోహంచేసి, దాంపత్యంలో ఆమెకు ఎంతో విశ్వాసమూ, సౌఖ్యమూ కలిగించి, భవిష్యత్తులో సుఖజీవితానికి హామీ యిచ్చి,—పరాయి స్త్రీని పొందేందుకు సాహసం చేస్తాడా? ఎం. ఏ. చదివిన చదువు తాలూకు విజ్ఞానమూ, ఉద్యోగం చేస్తూన్నప్పటి విచక్షణా జ్ఞానమూ—ఏమైనాయి? పెళ్ళికాని ఒక పిల్లను, తన ఆనందానికి బలిచేస్తే—జీవితాంతమూ ఆమె బ్రతుకుమీద కప్పబడే అవినీతి తాలూకు 'తెరకు' బాధ్యతను ఎవరు వహిస్తారు? ఆ పిల్ల 'విధికి' ఏడ్వవల

సిందేనా? అటువంటి అతి సామాన్యమైన విషయాన్నే ఆలోచించలేక పోయాడా తనబావ ?

—బావ తనని ఇన్నాళ్లనుంచీ అటువంటి దృష్టితోనే చూస్తున్నాడా? తన వేపు ఎన్నిసార్లు కొంటెగా చూడలేదు? ఆ కొంటెచూపు వెనుక కొంత గూఢార్థం ఉన్నదా? తనకి అప్పు డప్పుడూ ఇంగ్లీషు పొయి(ట్రీ ప్రైవేటు చెప్పేవాడు. ఆ చూపులో ఏదో ఆశ, ఆనందం ఉండేదా? అక్కయ్యతోపాటు తనని ఎన్నోసార్లు సినిమాలకు తీసుకెళ్ళాడు. ఒకటి రెండుసార్లు సరసన కూర్చున్న తన భుజంమీద చేయి వేశాడు. ఏదో పొరపాటున వేశాడేమో ననుకుంది తను. కాని అందులో కూడా 'ప్రయత్నం' ఉన్నదన్నమాట! తను యీ నాటివరకూ తెలుసుకో లేక పోయింది. బావకు తనమీద మొదట్నుంచీ మనస్సు ఉన్నదన్నమాట! ఈ విషయం తను ఇదివరలోనే గ్రహించివుంటే—తను ఇవాళ ఇక్కడ ఉండేది కాదు. అక్కయ్యతోపాటే బంధువుల ఊరు వెళ్లేది కదా!

బావ ఇంత దుర్మార్గుడా? అట్లా తన హృదయమే తలపోస్తోందా? తల్లీ తండ్రీలేని తనని బావ పోషిస్తున్నాడు. బావ తనకి చదువు చెప్పిస్తున్నాడు. తనకి యీ పట్టు జాకెట్టులూ, సిల్కువోణీలూ బావే కొని యిస్తున్నాడు. బావ డబ్బుతోనే ఏ సినిమాకు వెళ్ళినా, ఏరిక్షాలో కాలేజీకి వెళ్లినా! అటువంటి బావని తను దుర్మార్గుడని భావిస్తోందా! తనకి బావ రెండుసార్లు ఇంగ్లీషులో ఫస్టు మార్కులు తెప్పించాడు. తెలీని పాఠాలు చక్కగా-చివరకు తెలుగులోనైనా చెబుతాడు. అటువంటి బావని తను దుర్మార్గుడిగా, నిర్ణయించింది.

మరి బావచేసిన పనేమిటి?

తనని అనుభవించాలని ఉబలాట పడతాడా? తనకి పెళ్ళి కానక్కర్లేదూ? తనకీ జీవితంలో ఒక భర్త ఉండొద్దూ? తనూ 'స్త్రీ'గా సంఘంలో గౌరవంగా తిరగవొద్దూ? తనకీ హృదయమూ, నీతి, జ్ఞానమూ—లేవూ?

మరి బావ ఏం ఆలోచించి తనని కోరాడు? వయస్సులో ఉన్న కన్యమీదకు మనస్సు మళ్ళడం సహజమా? ఆమనస్సుకు నీతీ, నియమమూ, కట్టుదిట్టమూ అక్కర్లేదూ?

బావ తనని కోరాడు—ఆ కోర్కె ఏం సబబు?

తను నిరాకరించింది. ఏమీ చేయలేక ఏడ్చింది. బావ ఏమను కున్నాడో? హృదయం ఎంతగా తల్లడిల్లిందో? ఎంతగా బాధపడు తున్నాడో? ఛీ, తను పాపిష్టిది. భగవంతుడు తనకీ అందం ఎందుకు ఇచ్చాడో?

...రేగిన కోర్కెల్ని అణచుకోలేక బావ—ఎంతగా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడో? తను నిరాకరించటం—బావ అవమానంగా, అప్రదిష్టగా తలుస్తాడేమో? ఎప్పటికైనా తనని అనుభవించాలని ప్రతిజ్ఞ పడతాడేమో?

తను ఏం చేయగలుగుతుంది?

...............

బావ హృదయంలోని కోతకు తనే కారకురాలు! చదువుకున్న వాడు, అన్నీ తెలిసినవాడు, పరువూ ప్రతిష్ఠలు గల వ్యక్తి—తనజీవితం లోని ఎత్తు పల్లాలకు బాధ్యుడు, తననికోరితే—తను నిరాకరించడమా? బావకు కోపం రగిలించి, బావలో ద్వేషం హెచ్చుజేసి—తను ఈ ఇంట్లో ఉండగలదా? తన జీవితం ముందుకు సాగేవిధం ఏమిటి? బావే తనని ఒక దాన్ని చేయాలి! అట్లాంటి పరిస్థితుల్లో బావను ఎదిరించి తను ఎట్లా బ్రతక గలుగుతుంది?

ఈ ఇంట్లోంచి పారిపోతే, ఈ అర్థ రాత్రిలో...! పిచ్చియోచన. పారిపోయి—ఏం చేయగలుగుతుంది తను? ఏం సాధిస్తుంది? పద్దెనిమి దేళ్ల పడుచుపిల్ల యీ దేశంలో, సంఘపు తీరులో-స్వతంత్రంగా, పవి త్రంగా జీవించ గలుగుతుందా? సాధ్యమేనా? ఎవరో ఒకళ్ళ ఆసరా క్రిందనే స్త్రీజీవితం తాలూకు 'పాతివ్రత్యం' పవిత్రంగా కాపాడబడ గలుగుతుంది కానీ, మగదిక్కు లేకపోయిం తరవాత—తెల్లవారిలేస్తే ఇం దరి కళ్ళల్లోని మోహపు పొగల చీకటికీ, సరదానవ్వుల పోకిళ్లకూ, చేష్ట లకూ, ఎకసక్కాలకూ, యీసడింపులకూ-తను స్వతంత్రంగా బ్రతక గలుగుతుందా? తను ఏమైనా ఇంట్లోంచి పారిపోయే తెలివి తక్కువ ప్రయత్నానికి గురి కారాదు.

బావ కోర్కెను తను తీరిస్తే—?

అమ్మో!

ఏం?...బావలో కోపాన్ని తను చూడగలుగుతుందా? బావలో ద్వేషం పెరగటం తనకు క్షేమమా? అందుచేత...నీతినీ, హృదయాన్నీ న్యూనత పర్చటమా? తనను తను వంచించుకోవడమా? తరువాత—తన బ్రతుకు యొక్క విలువ ఎట్లా పరిణమిస్తుంది? ఎట్లానైనా పరిణమించనీ...

బావ కోర్కెను నిరాకరించడం తనకి శ్రేయస్కరం కాదు. బావే తెలుసుకుంటాడు—ఎప్పటికైనా. ఏది నీతో? ఏది సమంజసమో? తన బ్రతుకు ఎట్లానైనా తెల్లవారనీ,

తనని సంఘం ఎట్లానైనా చూడనీ,

తను నీతి విషయంలో ఎంత క్రిందకైనా దిగజారనీ,

ఈ వానాకాలపు రాత్రి, బావ సౌఖ్యానికి తను 'బలి' కాక తప్పదు!

ఆ నిర్ణయానికి రాజేశ్వరి వొచ్చింది. ఆ నిర్ణయానికి రావటానికి రాజేశ్వరి లేత గుండెలో ఎంతఘోరమైన సంఘర్షణ జరిగిందో, ఆమె ఎట్లా ఆత్మను పరిస్థితుల పరంగా వంచించుకుందో, భవిష్యత్తులోని భయంకరత్వాన్ని సయితం అనుభవించేందుకు ఎలా తల వొగ్గిందో చెప్పలేం.

చెమట పట్టిన ముఖాన్ని చక్కగా తుడుచుకుంది; అద్దంలో ముఖాన్ని చూసుకుంది; చెదిరిన తలను సరిచేసుకుంది; గదిలోంచి బయలు దేరింది-కాని గుండెలో దీపం 'టప్-టప్' అంటూనే ఉంది. కాళ్ళు వెనక్కు లాగుతోనే ఉన్నాయి-కళ్లు బెదురుతూనే ఉన్నాయి. వొళ్లంతా ఏదో ఆవరించినట్టు వొణుకు-

ఉత్తరపు దిక్కున మెరుపు మెరిసింది.

ఉరుము ఉరిమింది-భీకరంగా.

గాలి, వాన, చలీ!

ఆనందరావు గది ముంగిట అడుగు పెట్టింది. భూమి కదులుతోందా? భూకంపం రాబోతోందా?

ఆనందరావు గది తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు మెల్లగా త్రోసింది. గదిలో చీకటి; ఆమెలోని భయం-చీకటిని చూడటంతో అంతకు రెండింతలు అయింది. గదిలో ప్రవేశించడమా? గది వెలుపల

కూర్చుని ఏడ్వటమా? కళ్లు మూసుకొని, పళ్ళు బిగబట్టి-ఆలోచించింది; తను చేయబోతూన్న సాహసం తాలూకు మంచి చెడ్డల్ని.

గదిలో అడుగు పెట్టింది. గదినిండా చీకటి. టేబుల్ మీద ఉన్న రేడియమ్ డయల్ వాచ్ 10-45 గంటలు చూపిస్తోంది. ఆనందరావు మంచం దగ్గరకు వెళ్ళింది. మంచంమీద కూర్చుంది. చీకట్లో - గుండెను రాయి చేసుకుంది. జారిపోతోన్న సత్తువను కూడ గట్టుకుంది.

'బావా!' అంటూ, ఆనందరావు మీదకు వాలింది ఆ చీకట్లో.

'రాజేశ్వరీ! ఏమిటా సాహసం?' చివుక్కున లేచాడు ఆనందరావు. గబుక్కున లైటువేశాడు.

రాజేశ్వరి ముఖం మసిబూసి నట్లయింది.

'రాజేశ్వరీ! పెళ్ళికాని పిల్లవు. పెళ్ళిచేసుకొని జీవితంలో సుఖంగా, సంఘంలో గౌరవంగా బ్రతకవలసినదానవు. క్షణికమైన సుఖాలకు ఆశించి, మెరపులాంటి ఉద్రేకాలకు లోనై, జీవితపు విలువలకు మూలాధారమైన నీతి విషయంలో క్రిందకు దిగజారి, - భవిష్యత్తును ఎందుకు పాడు చేసుకుంటావు? వెళ్లు! రాజేశ్వరీ! ఈ సుఖంలోని మత్తు శాశ్వతం కాదు. స్త్రీకి తన పాతివ్రత్యం తాలూకు పవిత్రతే ముఖ్యం. క్షణికానందం కోసమని యీ బురదలో దిగితే-ఆ మచ్చ, జీవితాంతమూ బాధిస్తూ వుంటుంది. వెళ్లు-రాజేశ్వరీ!' అన్నాడు ఆనందరావు, ఎంతో బాధగా.

రాజేశ్వరికి ముఖంమీద చెళ్లున కొట్టినట్లయింది.

ఆమెకు ఆ సమయంలో-కనురెప్పలు క్రిందికి వాలలేదు. బావవంక ఆశ్చర్యంతో అలానే చూస్తూ వుండి పోయింది. బావలో కలిగిన మార్పు, ఆ మార్పుయొక్క తీవ్రతా ఆమెకు అర్థం కాలేదు.

బిగ్గరగా ఏడ్వాలనిపించింది.

తడబడుతూ వొచ్చి తన గదిలో మంచంమీద పడుకొని-దిండుమీద తలపెట్టి నిజంగా ఏడ్చింది.

పిచ్చి పిల్ల! తన ఆనందం కోసం-మనస్సు మార్చుకొని, హృదయాన్ని రాయిచేసుకొని చీకట్లో తన గదిలోకి వొచ్చింది. కాని జీవితంలో అతి జాగ్రత్తగా వుండవలసిన యీ వయస్సులో కాలు జారుతే - బ్రతుకు

ండలు కాక, ఇంకేమన్నా ఉందా? కాని బావకు ఆనందం ఇవ్వడం కోసం, ఆయనకు కోపం కలగడం తనకి క్షేమం కాదని ఆలోచించి, సాహసం చేయటానికి ఆత్మను వంచించుకుంది. ఇంకానయం; క్షణంలో కాలు జారి అగాధంలోకి తలక్రిందులుగా పడేది. బావలో వొచ్చిన మార్పు తననూ, బావనూ, ఆ కుటుంబాన్నంతనూ పతనావస్థ నుంచి కాపాడింది.

యీ గదిలో ఆనందరావు కూడా ఆలోచిస్తున్నాడు.

తను నీచుడు, బుద్ధిహీనుడు. లేకపోతే ఆమెను తను కోరటమేమిటి? రాజేశ్వరి పరిస్థితి ఏమిటి? ఆమె జీవితాన్ని చక్కబర్చవలసిన బాధ్యత ఎవరిమీద ఉంది? అటువంటి తనే తాత్కాలిక ఉద్రేకాలకులోనై ఇంతచదువూ చదివిన విజ్ఞానాన్నీ, ఇంతలోకం చూసిన విచక్షణాజ్ఞానాన్నీ మరిచి, అవివేకియై, మూఢుడై, ఆమె శరీరాన్ని వాంఛించితే- ఆమె బ్రతుకు ఏం కావాలి? ఆ పిల్ల పట్ల అట్లాంటి తన ప్రవర్తన తన జీవితానికీ, తన పరువుకూ, తన గౌరవానికీ - ఆమె జీవితానికీ, ఆమె పరువుకూ, ఆమె గౌరవానికీ ఎంత న్యూనత? అందుచేతనే తను ఆడిపోసుకొని చెంపలు వాయించుకొని, పాడు మనస్సును మార్చుకున్నాడు: మార్చుకోగలిగాడు! ఇక ముందెప్పుడూ, ఇలాటి ప్రమాదంలో పడకూడదని బాస చేసుకున్నాడంటే, ఆశ్చర్య మేమిటి?

